నమస్తే తెలంగాణ
నల్లగొండ
I | నల్లగొండ, శుక్రవారం 2 మే 2025 | NALGONDA

పార్టీ గ్యాంగ్ సభ్యులకు జైలు, జరిమానా

రామగిరి, మే 1: మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్, అంతర్రాష్ట్ర దొంగల ముఠా అయిన పార్టీ గ్యాంగ్ సభ్యులకు నల్లగొండ కోర్టు 18 నెలల జైలుశిక్ష, జరిమానా విధించినట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని చిట్యాల, నార్కట్‌పల్లి, కట్టంగూర్ మండలాలు, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ , సంగారెడ్డి జిల్లాలో హైవేపై వాహనాలు ఆపి క్యాబిన్‌లో పండుకున్న వారిని రాళ్లతో కొట్టి వారి వద్ద నుంచి బంగారం, డబ్బులు దొంగించే మహారాష్ట్రకు చెందిన పంద్రాంగ పవార్, దిల్సార్ అశోక్ పవార్‌పై 2024 మే 18న కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖాలు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం కేసు విచారించిన నల్లగొండ కోర్టు నిందితులపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. నిందితులకు శిక్ష పడేలా ఆధారాలు సమర్పించిన పోలీసు అధికారులను ఎస్పీ అభినందించారు.

సూర్యాపేటలో జెండా ఎగురవేస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

పాత కార్యాలయానికి కొత్తగా ప్రారంభోత్సవం

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నిర్వాకం

క్యాంప్ ఆఫీస్ శిలాఫలకం తొలగించి కొత్తగా మరొకటి

- 2023 మే1న ప్రారంభించిన నాటి మంత్రి జగదీశ్‌రెడ్డి
- అక్కడి నుంచే ఎమ్మెల్యేగా కూసుకుంట్ల విధులు
- ఉప ఎన్నికలకు ముందు ఇదే కార్యాలయాన్ని పట్టించుకోని రాజగోపాల్‌రెడ్డి
- చాలాచోట్ల బీఆర్ఎస్ పనులకే కొత్తగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- విస్మయం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు

2023 మే ఒకటిన మునుగోడులో క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించి అప్పటి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని అభినందిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, మే1(నమస్తే తెలంగాణ) : మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టడంలో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ప్రభుత్వ మంజూరు చేసిన పనులకు కొత్తగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ ఇవి తమ ప్రభుత్వానివేనన్న బిల్డప్ ఇస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మునుగోడులో రెండేళ్ల కిందట ప్రారంభించిన ఎమ్మెల్యే అధికారిక క్యాంప్ కార్యాలయాన్ని బుధవారం మరోసారి ప్రారంభించడమే ఇందుకు ఉదాహరణగా చెప్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలకు అధికారిక క్యాంప్ కార్యాలయాల నిర్మాణానికి కేసీఆర్ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మునుగోడులోనూ చండూరు రోడ్డులోని ప్రభుత్వ భూమిలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. దీన్ని పూర్తి చేసే విషయంలో 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన రాజగోపాల్‌రెడ్డి మూడేండ్లపాటు పట్టించుకోలేదు. 2022 నవంబర్‌లో జరిగిన ఉప ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి గెలుపొందారు. అసంపూర్తిగా ఉన్న క్యాంప్ కార్యాలయాన్ని ఆయన పూర్తి చేశారు. ఆరు నెలల్లోనే పూర్తి సకల వసతులతో తీర్చిదిద్దారు. అప్పటి విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి 2023 మే ఒకటిన లాంఛనంగా ప్రారంభించారు. నాటి నుంచి 2023 డిసెంబర్‌లో ఎన్నికలు జరిగే వరకు కూడా అప్పటి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఇక్కడి నుంచే కార్యకలాపాలు కొనసాగించారు. ఆ తర్వాత ఎన్నికల్లో గెలుపొందిన రాజగోపాల్‌రెడ్డి ఏడాది పాటు అటువైపు కూడా చూడలేదు. అప్పటికే స్థానికంగా ఓ ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసుకున్న క్యాంప్ కార్యాలయం నుంచే పని చేస్తూ వచ్చారు. ఆ స్థల యజమాని దాన్ని ఖాళీ చేయాలని ఒత్తిడి చేయడంతో అనివార్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన క్యాంప్ కార్యాలయంపై రాజగోపాల్‌రెడ్డి దృష్టి పడింది. దాంతో ఈ ఏడాది ప్రారంభంలో అందులో అదనపు సౌకర్యాల పేరుతో మరమ్మతులు చేపట్టారు. ఇంతవరకు ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ ఆ కార్యాలయాన్ని తామే నిర్మించినట్లుగా కొత్తగా శిలాఫలకం వేసి, తాజాగా బుధవారం దాన్ని ప్రారంభించి, అందులోకి ప్రవేశం చేసినట్లు హంగామా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


తాజాగా బుధవారం కొత్త శిలాఫలకం వేసి క్యాంప్ కార్యాలయాన్ని తిరిగి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

పాత శిలాఫలకం తొలగింపు...

2023 మే ఒకటిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని రాజగోపాల్‌రెడ్డి పూర్తిగా తొలగించారు. దాని స్థానంలో కొత్తగా ఇప్పటి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీల పేర్లతోపాటు తానే ప్రారంభిస్తున్నట్లు రాజగోపాల్‌రెడ్డి పేరుతో రూపొందించిన శిలాఫలకం ఏర్పాటు చేశారు. కేవలం తనకు అవసరమైన అదనపు సౌకర్యాల ఆధునీకరణ పేరుతో మొత్తం క్యాంపు కార్యాలయాన్ని తామే నిర్మించినట్లు బిల్డప్ ఎందుకున్న ప్రశ్నలు నియోజకవర్గవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. ఒక వేళ అదనంగా నిధులు వెచ్చించి నిర్మాణం చేస్తే పాత శిలాఫలకాన్ని అలాగే ఉంచి కొత్తగా మరొకటి ఏర్పాటు చేస్తే పెద్దగా అభ్యంతరాలు ఉండేవి కావంటున్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వ నిధులతో నిర్మించిన క్యాంపు కార్యాలయాన్ని పునాదుల నుంచి కాంగ్రెస్ సర్కారే నిర్మించి పూర్తి చేసినట్లు రాజగోపాల్‌రెడ్డి ఖాతాలో వేసుకునే చర్యలు సరికావని బీఆర్ఎస్ శ్రేణులు హెచ్చరిస్తున్నాయి. ఇక చండూరు మున్సిపాలిటీలో సైతం ఉప ఎన్నికల అనంతరం అప్పటి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులకు స్వయంగా అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. అప్పట్లో వీటికి సంబంధించిన శిలాఫలకాలను కూడా ఏర్పాటు చేశారు. వాటిని సైతం కనుమరుగు చేయాలనే కుట్రతో రోడ్డు విస్తరణ పనుల పేరుతో తొలిగించారు. తొలగించే సమయంలో స్థానికంగా అభ్యంతరాలు వెల్లడవగా, మరోచోట ఏర్పాటు చేస్తామని చెప్పి తొలగించారు. ఆ శిలాఫలకాలను ఏం చేశారో నేటికీ స్పష్టత లేదు. ఇలా నియోజకవర్గవ్యాప్తంగా ఉప ఎన్నికల అనంతరం కేసీఆర్ సర్కారు మంజూరు చేసిన పనులనే నేటికీ కొనసాగిస్తూ వాటిని మంజూరు చేసిన ఆనవాళ్లను మాత్రం లేకుండా చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాదిన్నర కాలంలో కొత్తగా చేసిన అభివృద్ధి ఏమీ లేదని, పాత వాటికే కొత్తగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే కుట్రలను కాంగ్రెస్ నేతలు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. కొత్తగా తెచ్చిన నిధులు కూడా లేవు. విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో వచ్చిన పనులకే కొత్తగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. మునుగోడులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కేసీఆర్ ఇచ్చిన నిధులతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది 2023 మేలోనే ప్రారంభించాం. ఇప్పుడు అదే కార్యాలయాన్ని తిరిగి కొత్తగా ప్రారంభించడం ఏంటో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి. ఆయనేమీ చేయలేక, పాత పనులతోనే ప్రజలను మభ్యపెట్టాలని చూస్తూ రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నాడు. ఎమ్మెల్యేగా గెలిచి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ ఒక్క పని కొత్తగా మంజూరు చేయించలేదు. అన్నింటికీ మంత్రి పదవిని బూచిగా చూపుతూ కాలయాపన చేస్తున్నాడు. చివరకు మంత్రి పదవి రాదన్న వార్తలతో పిచ్చిలేచినట్లు ప్రవర్తిస్తున్నాడు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కొత్తగా ప్రారంభించడం అందులో భాగమే. నియోజవర్గంపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కొత్తగా నిధులు తెచ్చి అభివృద్ధి చేసి చూపాలి. లేదంటే ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయం.

-కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే

ఘనంగా మేడే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. గురువారం మేడేను పురస్కరించుకుని వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండాలు ఎగురవేశారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలో ఆటో యూనియన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అడ్డాలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి బీఆర్ఎస్‌కేవీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ఐక్యతతో గతంలో ఎన్నో సాధించుకున్నామని, ఏ రంగంలో పని చేసే కార్మికులైనా ఐక్యతను పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

జిల్లా అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డికి సవాల్

- జిల్లా ప్రజల ముందే చర్చ పెడుదాం
- వాళ్లు ఫ్లోరైడ్‌ను పెంచి పోషిస్తే మేం పారదోలాం
- మూసీ మురికి నీళ్లకు బదులు కృష్ణా నీళ్లు తాపించాం
- వాళ్లు జిల్లాను ఎడారి చేస్తే మేం 40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించాం
- ఎల్కతుర్తి సభతో కాంగ్రెస్ నేతల్లో వణుకు
- అందుకే అవాకులు చవాకులు
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, మే1(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ రజతోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఎల్కతుర్తి బహిరంగ సభకు తరలివచ్చిన లక్షలాది మంది జనాన్ని చూసి కాంగ్రెస్ నేతల వెన్నులో వణుకు మొదలైందని, అందుకే సభ సక్సెస్‌ను జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. జిల్లా మంత్రులు మతి తప్పి ఏదేదో మాట్లాడుతున్నారని, అవాకులు చవాకులు పేలుతున్నారని ఎద్దేవా చేశారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి దమ్ముంటే పదేండ్లలో జరిగిన జిల్లా అభివృద్ధిపై ప్రజల్లోనే చర్చ పెడుదాం, అందుకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. కృష్ణా జలాలను వినియోగించ లేక, సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోకుండా జిల్లాను ఎడారిగా మార్చిన ఘనత కాంగ్రెస్ నేతలదని విమర్శించారు. గురువారం నల్లగొండలో మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి మీడియాతో చేసిన చిట్‌చాట్‌లో కాంగ్రెస్ నేతల తీరుపై జగదీశ్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. దశాబ్దాలుగా పాలించిన కాంగ్రెస్ నేతలు జిల్లాలో ఫ్లోరైడ్ భూతాన్ని పెంచి పోషిస్తే పదేండ్ల కేసీఆర్ పాలనలో ఫ్లోరైడ్‌ను తరిమికొట్టిన చరిత్ర తమదన్నారు. ఏండ్ల తరబడి సూర్యాపేట ప్రజలు మూసీ మురికి నీళ్లే తాగునీరంటూ తాను మంత్రిగా సూర్యాపేట ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలను అందించానని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో ఎన్నడూ 4 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను పండించిన చరిత్ర జిల్లాకు లేదని, కానీ తమ పదేండ్ల పాలనలో 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసి రాష్ట్రానికే జిల్లాను తలమానికంగా నిలిపిన చరిత్ర కేసీఆర్ సర్కార్‌ది పేర్కొన్నారు. కృష్ణా జలాల వాటాను కూడా వాడుకోలేని దద్దమ్మలు ఆనాటి కాంగ్రెస్ పెద్దలన్నారు. బీఆర్ఎస్ హయాంలో చివరి భూముల వరకు నీళ్లు పారిస్తూ... ఎకరా పంట కూడా ఎండకుండా నీళ్లిచ్చామని గుర్తుచేశారు. ఈ ఏడాది నిబంధనలకు విరుద్ధంగా కృష్ణా నీళ్లను ఏపీ సర్కారు తరలించుకుపోతుంటే ఇక్కడ సీఎంగా ఉన్న చంద్రబాబు శిష్యుడు కండ్లు అప్పగించి చూశాడంటూ మండిపడ్డారు. ఉమ్మడి జిల్లాను పాలన సౌలభ్యం కోసం మూడు జిల్లాలుగా చేసి, జిల్లాకు ఒక మూడు మెడికల్ కాలేజీ ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఉమ్మడి జిల్లాలో ఎన్నో అద్భుతాలు చేసి చూపామని తెలిపారు. దశాబ్దాలుగా జిల్లాను పాలించిన కాంగ్రెస్ నేతలు పొట్టలు పెంచుకుని జేబులు నింపుకోవడంపైనే దృష్టి పెట్టారని, జిల్లా ప్రయోజనాలను గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక, ప్రజల్లో ఎప్పటికప్పుడు కొత్త సమస్యలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. అసెంబ్లీలో ఇష్టమొచ్చినట్లు బూతులు మాట్లాడి పరువు తీసుకున్నారన్నారు.

ముమ్మాటికీ కాంగ్రెస్సే విలన్

తెలంగాణకు ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీనే విలన్ అని సభలో కేసీఆర్ చెప్పడం కాంగ్రెస్ నేతలకు జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణకు ఆది నుంచి ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీనేనని స్పష్టం చేశారు. తెలంగాణలో రాహుల్‌గాంధీ పెట్టిన సభలో బీఆర్ఎస్ సభలో పల్లీ బఠానీలు అమ్ముకున్నంత జనం కూడా లేరని పేర్కొన్నారు. ఇలాంటి సభలు బీఆర్ఎస్, కేసీఆర్‌కే సాధ్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలు పట్టించుకోవడం లేదని, ఆయన పేరు కూడా గుర్తు ఉండడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం తమకు లేదని, వాళ్లకు వాళ్లే కూల్చేసుకుంటారని తెలిపారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే సీఎం మార్పు అంశాన్ని తెరపైకి తెస్తున్నారని చెప్పారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి మారే గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా కేసీఆర్ గురించి మాట్లాడితే ప్రజలు నవ్వుకుంటారని, ఆయన పొద్దుతిరుగుడు పువ్వు లాంటి వ్యక్తి అని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మందడి సైదిరెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సర్కారు ఆఫీసులో గుక్కెడు మంచినీళ్లు కరువు

- నకిరేకల్ వ్యవసాయ కార్యాలయంలో రైతుల అవస్థలు
- నీళ్లడిగిన వారిపై సిబ్బంది దురుసు ప్రవర్తన
- ప్రభుత్వం బిల్లులు ఇస్తలేదని సమాధానం

ఏఓ కార్యాలయంలో నీళ్లు లేని ఖాళీ కుండ

నకిరేకల్, మే 1 : అందరికీ అన్నం పెట్టే రైతులకు గుక్కెడు మంచి నీళ్లు కరువయ్యాయి.. అదీ ప్రభుత్వ కార్యాలయంలో! ఎండన పడి వచ్చాం.. గొంతు తడుపుకొనేందుకు గిన్ని నీళ్లియ్యండి అని ప్రాధేయపడితే... మాకే నీళ్లు లేవు.. మీకెక్కడి నుంచి తెచ్చి ఇవ్వాలంటూ దురుసు సమాధానం ఎదురవుతున్నది. మంచి నీళ్లకు ప్రభుత్వం బిల్లులు ఇవ్వడం లేదు.. ఎవరికి చెప్పుకొంటారో చెప్పుకోండంటున్నారని రైతులు వాపోతున్నారు. నకిరేకల్ చుట్టుపక్కల గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులు అకౌంట్ వివరాలు ఇచ్చేందుకు గురువారం స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి వచ్చారు. విపరీతమైన ఎండ ఉండడంతో దాహం వేసిన రైతులు గొంతు తడుపుకొందామంటే కార్యాలయంలోని కుండలో నీళ్లు లేవు. రైతులు తాగేందుకు కొన్ని నీళ్లు ఇయ్యండని సిబ్బందిని అడిగితే దురుసుగా బదులిచ్చారు. 'ఇక్కడ నీళ్లు లేవు.. ఏమీ లేవు. బయట షాపులు ఉన్నాయి. వాటర్ బాటిల్ కొనుక్కోపోండి. మీ ఇష్టమొచ్చిన చోట చెప్పుకోండి' అంటూ సీరియస్ అయ్యారు. దాంతో చేసేది లేక కొందరు బయటకు వెళ్లి తాగి వచ్చారు. ఈ కార్యాలయానికి నిత్యం వందమందికిపైగా రైతులు వచ్చిపోతుంటారు. ప్రభుత్వ కార్యాలయంలో కనీసం నీళ్లు పెట్టరా అని ఎవరైనా ప్రశ్నిస్తే.. ప్రభుత్వం నుంచి నీళ్లకు బిల్లు ఇవ్వడం లేదని సిబ్బంది చెప్తున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఏడీఏ, ఏఓ ఎండీ జానీమియాను వివరణ కోరగా.. 'ప్రభుత్వం నుంచి వ్యవసాయాధికారి కార్యాలయానికి నీళ్లకు గానీ, కరెంటుకు గానీ ఒక్క రూపాయి కూడా రావడం లేదు. మండల కార్యాలయానికి అటెండర్ కూడా లేరు. ఏడీఏ కార్యాలయానికి ఉన్న ఇద్దరు అటెండర్లలో ఒకరిని ఏఓ కార్యాలయానికి వాడుతున్నాం. సిబ్బందికే నీళ్లు లేవు. రైతులపై దురుసుగా ప్రవర్తించిన వారిని మందలిస్తాం' అని చెప్పుకొచ్చారు.

గొంతు ఎండిపోతుందన్నా నీళ్లు ఇయ్యలే

మార్కెట్లో అమ్మిన వడ్ల డబ్బుల కోసం దరఖాస్తు చేసుకుందామని వ్యవసాయ కార్యాయానికి వచ్చిన. సెంటర్ల ఆటో దిగి ఆఫీసుకు నడుచుకుంటూ వచ్చేసరికి గొంతు ఎండిపోయింది. ఆఫీసుల ఉన్న కుండలో నీళ్లు లేవు. నీళ్లు ఇయ్యమని అక్కడున్న మేడమ్‌లు, సార్లను అడిగితే నీళ్లు లేవు.. ఏం లేవు. బయట షాపు ఉంది కొనుక్కొచ్చుకోపో అని ఒకరన్నరు. నీళ్లు లేవు.. ఊరికే వొర్లించకు.. ఎక్కువ మాట్లాడకు.. దిక్కు ఉన్నచోట చెప్పుకో పో అని ఇంకొకలు అడ్డగోలుగా మాట్లాడిండ్రు. సెంటర్‌లో ఉన్న చలివేంద్రానికి పోయి తాగివచ్చిన.

-విజయమ్మ, రైతు, చందంపల్లి, నకిరేకల్ మండలం

ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నార్కట్‌పల్లి, మే1 : కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు అధిక సంఖ్యలో లారీలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. సరిపడా లారీలు అందుబాటులో లేక ధాన్యం తరలింపు మందకొడిగా జరుగుతుందని కేంద్రం నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన కలెక్టర్ లారీ కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తగినన్ని లారీలు ఏర్పాటు చేసి తక్షణమే ధాన్యాన్ని తరలించాలని ఆదేశించారు. ఒక వేళ కాంట్రాక్టర్ స్పందించకుంటే అతడిపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే చెల్లింపులు నిలిపివేయాలని సూచించారు. ధాన్యం సేకరణ విషయంలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. రైతులు సరైన తేమశాతంతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే విధంగా వారికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట అధికారులు ఉన్నారు.

వైద్యుల గైర్హాజరుపై అదనపు కలెక్టర్ ఆగ్రహం

రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపుకలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ, మే 1: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో వైద్యులు గైర్హాజరు కావడంపై అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. వైద్యుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. 8 మంది వైద్యులు విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. ముందస్తు సమాచారం లేకుండా విధులకు హాజరు కాని వైద్యులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించనున్నట్లు చెప్పారు. ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వసతులు, వైద్య సేవలపై ఆరాతీశారు. ఆయన వెంట ఆస్పత్రి వైద్యులు ఉన్నారు.

మేడే ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత

భువనగిరి అర్బన్, మే 1 : కార్మికులు కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.మాధవీలత అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో గురువారం నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఇ-శ్రమ్, కార్మిక సంక్షేమ చట్టాలు, రాష్ట్ర, కేంద్ర సంక్షేమ పథకాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్మిక చైతన్యం, కార్మిక శక్తి దేశ పురోభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్మికుల సంక్షేమ చట్టాలను పరిరక్షించే బాధ్యత అందరిపైనా ఉందని, కార్మికులకు ఏదైనా న్యాయ సహాయం అవసరమైతే న్యాయవాదులను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి బొల్లెపల్లి కుమార్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ ఎస్.జైపాల్, జి.శంకర్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.జైపాల్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి.శంకర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ ఎన్.రాజశేఖర్, సాయి శ్రీనివాస్, ప్రకాశ్‌రెడ్డి, శ్రీశైలం, కార్మికులు పాల్గొన్నారు.

ఎంజీయూ బీఈడీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

రామగిరి, మే 1: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ కళాశాలల సెమిస్టర్ 1, 3 రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను గురువారం అధికారులు విడుదల చేశారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు సీఓఈ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. సెమిస్టర్ -1లో 2,801మంది విద్యార్థులు హాజరుకాగా 2,134మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. దాంతో పాటు 666మంది ప్రమోట్‌కాగా ఒక విద్యార్థి మాల్ ప్రాక్టిస్‌లో ఉంచినట్లు తెలిపారు. సెమిస్టర్-3లో 2,474 మంది హాజరుకాగా 2,230మంది ఉత్తీర్ణత సాధించారని, 244మంది ప్రమోట్ అయినట్లు పేర్కొన్నారు.